

# ప్రాణం తీసిన నియమం

– భమిడిపాటి సోమయాజి

లలితాదేవి లలితా సహస్రనామం చదువుతోంది. అబద్ధమాడడం ఇష్టంలేక లలితాప్రసాద్ తన భార్యను ఒప్పించి ఆ రోజు శుక్రవారమైనా పనిమనిషికి జీతం ఇప్పిద్దామని పూజా గది దగ్గర నిలబడి ఉన్నాడు. ఆవిడ పారాయణ చేసేటప్పుడు అంతరాయం కలిగిస్తే మహాకాళి అవుతుంది. ఆవిడ పారాయణ చేసుకుంటూనే ఏమిటి అన్నట్లు భర్తకేసి చూసింది.

"పనిమనిషి కూతురికి నొప్పులు వస్తున్నాయని ఈ రోజు తన జీతం ఇమ్మని అడిగింది" విషయం చెప్పాడు. లలిత మండిపడింది.

"ఈరోజు శుక్రవారం కదా. డబ్బు ఎలా ఇస్తాం? అంత అవసరమైతే నిన్ననే అడిగి తీసుకెళ్ల వలసింది. నా నియమం తెలిసి కూడా నా పారాయణకి అంతరాయం కలిగించడమెందుకు. రేపు ఇస్తాం అని చెప్పండి." లలితాప్రసాద్ తన భార్య చెప్పిన విషయం పనిమనిషికి చెప్పాడు.

"నెలంతా కష్టపడి అంట్లు, బట్టలు శుభ్రం చేసేది డబ్బు లేకే కదా బాబూ. ఏం చేత్తాం.. వత్తాను బాబు" అని వెళ్లిపోయింది పనిమనిషి లచ్చి.

లలితాదేవి పూజ ముగించుకుని బయటకు వచ్చింది. వస్తూనే "ఎప్పుడైనా సరే శుక్రవారం మాత్రం డబ్బులు ఎవరికీ ఇవ్వవద్దు. ఈ విషయం ఇంతకుముందు చాలాసార్లు చెప్పాను మీకు. గుర్తు పెట్టుకోండి. ఇకపైన చెప్పనవసరం లేకుండా చేయండి. గుమ్మంలో ఏదో అలికిడి అవుతోంది. ఎవరో వచ్చినట్లున్నారు. చూడండి" అంది లలిత.

లలితాప్రసాద్ వెంటనే బయటకి వెళ్లి చూసాడు. గుమ్మంలో లచ్చి దీనంగా నిలబడి వుంది. మళ్లీ డబ్బు కోసమే వచ్చి వుంటుందని ఊహించిన లలితాప్రసాద్ భార్యకి చెప్పాడు.

రుసరుసలాడుతూ వచ్చిన ఆమె "ఏమే! మళ్లీ వచ్చావు? డబ్బు రేపు ఇస్తానని అయ్యగారు చెప్పారుకదా" అంది.

"ఏదో ఇంజెక్షన్ ఇవ్వాలిటమ్మా. అర్జంటుగా అయిదు వందలు కావాలి. పిల్ల పురిటినొప్పులతో విలవిల్లాడుతోంది" అంది లచ్చిమి.

"ఎవరి దగ్గరైనా తీసుకో. రేపిస్తానులే" అని దాని సమాధానం కోసం ఎదురు చూడకుండా లోపలికి వచ్చేసింది లలిత.

లచ్చిమి నిరుత్సాహంగా వెళ్లిపోవడం కిటికీలోంచి చూసిన లలితాప్రసాద్ ఎంతో బాధపడ్డాడు.

"లలితా! నేనొక విషయం చెప్తాను విను. రెండోసారి డబ్బుకోసం వచ్చిందంటే ఆ ఇంజెక్షన్ ఎంత అవసరమో! ఏమిటో ఈ శుక్రవారం నియమం. సిటీబస్సెక్కితే శుక్రవారమైనా డబ్బిచ్చి టిక్కెట్ కొంటాం కదా. ఆ రోజు అస్సలు డబ్బు బయటకి తియ్యకుండా గడుస్తుందా చెప్పు" అన్నాడు లలితాప్రసాద్.

"మీరేం ధర్మపన్నాలు చెప్పనక్కర్లేదు" అని విసురుగా అక్కడ్నుంచి వెళ్లిపోయింది లలిత.

***

సాయంకాలం స్కూటర్ మీద ఇంటకొస్తున్న లలితాప్రసాద్‌కి హాస్పిటల్ దగ్గర జనం గుమిగూడి ఉండడం కన్పించింది. విషయం అడిగాడు ఏమిటని.

"ఎవరో లచ్చిమట బాబూ. ఆమెకు ఒక్కర్తే కూతురట. డబ్బులేక, సరైన సమయానికి ఇంజెక్షన్ ఇప్పించలేదుట. ప్రసవవేదన పడుతూ పోయిందిట" అన్నాడతను. లలితాప్రసాద్‌కు గుండె ఆగినంత పనయింది. జనాన్ని తప్పించుకుని లోపలికి చూసాడు. అక్కడ తన పనిమనిషి లచ్చిమి తన కూతురి శవంపై పడి ఏడుస్తోంది. లచ్చిమి తనను చూస్తుందేమోనని భయమేసి ఇంటికి వచ్చేసాడు. తన భార్యకి మాత్రం జరిగిన విషయం చెప్పలేదు. ఆ రాత్రి అతనికి నిద్ర పట్టలేదు.

***

ప్రొద్దునే పూజకి తయారవుతూ లలిత భర్తతో చెప్పింది "పనిమనిషి వెళ్లేటప్పుడు దాని జీతం అయిదువందలు మీరిచ్చేయండి. మళ్లీ నేను పూజలో వుంటానేమో. దాని కూతుర్ని హాస్పిటల్‌కు తీసుకెళ్లాలేమో" అంది.

లలితాప్రసాద్‌కి ఒక్కసారిగా మనస్సు భగ్గుమంది. కోపం కట్టలు తెంచుకుంది.

"సర్లే చాలు నిర్వాకం. దాని కూతురు చనిపోయింది. అది పదే పదే డబ్బు అవసరం, ఇంజెక్షన్ ఇప్పించాలంటే నీవు కనికరించలేదు. శుక్రవారం నియమం అన్నావు. నువ్వూ కన్నావు ముగ్గురు పిల్లల్ని. సాటి ఆడదానిగా దాని కూతురు ప్రసవవేదన అర్థం చేసుకోలేకపోయావు. అసలు ప్రతి ఆడదీ ఆ ప్రసూతి వైరాగ్యం మరచిపోకపోతే బావుంటుంది. అసలీ నియమాలకు అర్థంలేదు. నియమాలనేవి మానవుల జీవితాలు క్రమశిక్షణలో పెట్టడానికే కాని ఎదుటి వారిని మన మూర్ఖత్వంతో శిక్షించడానికి కాదు. నియమాలు మనల్ని సంస్కరిస్తూ ఎదుటివాళ్లని సుఖపెట్టాలి. ఇకపై ఈ విషయం గుర్తు పెట్టుకో. ఈ విషయం పదే పదే ఇకపై చెప్పను" అన్నాడు.

తరువాత పూజల విషయంలో నియమ నిష్టలు పాటించే లలిత డబ్బు విషయంలో ఈ నియమం అస్సలు పాటించేది కాదు.

★